గురుకుల బాటపై సర్కారు ఉలికిపాటు

- తాండూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థుల పరామర్శకు వెళ్తుండగా సబిత, సత్యవతి రాథోడ్ అరెస్ట్
- వికారాబాద్ వద్ద నేతల అడ్డగింత
- రోడ్డుపై బైఠాయించి నిరసన
- అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలింపు
- పరామర్శకు వెళ్తే ఉలికిపాటు ఎందుకు?: మాజీ మంత్రి సబిత
- కుట్రల సంస్కృతి కాంగ్రెస్‌దే : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- ఆడబిడ్డలను అడ్డుకోవడం అమానవీయం : కేటీఆర్

రోడ్డుపై బైఠాయించిన మాజీ మంత్రులు సత్యవతి, సబితా, మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, డిసెంబర్ 12, (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా తాండూరు లోని ఎస్టీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌ను గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసులు అరెస్ట్ చేశారు. మాజీమంత్రులు సహా బీఆర్ఎస్ నేతలను వికారాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి విగ్రహం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పోలీసుల తీరుకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి వెళ్తామని జిల్లా ఎస్పీ, కలెక్టర్‌తో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఫోన్ చేసి మాట్లాడినా వెళ్లేందుకు అనుమతివ్వకపోవడంతో మాజీ మంత్రులతో పాటు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పీ శ్రీశైల్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌తోపాటు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు రోడ్డుపైనే బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు సబితారెడ్డి, సత్యవతి రాథోడ్, శ్రీశైల్ రెడ్డిలను చన్గోముల్ పోలీస్ స్టేషన్‌కు, మెతుకు ఆనంద్‌ను నవాబుపేట్ పోలీస్ స్టేషన్‌కు, శుభప్రద్‌పటేల్‌ను పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి అరెస్టులకు నిరసనగా తాండూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నాకు దిగాయి.

ప్రభుత్వానికి ఉలుకెందుకు?

విద్యార్థులను పరామర్శించేందుకు వెళ్తుంటే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కి పడుతున్నదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. హాస్టళ్లలోని బండారం బయటపడుతుందనే భయపడుతున్నారా? అని ఎద్దేవా చేశారు. తాండూరు, వికారాబాద్‌లలో దవాఖానలున్నా విద్యార్థులకు హాస్టళ్లలోనే ఎందుకు చికిత్స అందిస్తున్నారని, కలెక్టర్, ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనుమతిస్తే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్తామని పేర్కొన్నారు. విద్యార్థుల పరామర్శకు ప్రొటోకాల్ వర్తించదని కలెక్టర్ చెప్తున్నారని, ఎమ్మెల్యే తమ్ముడికి ఉంటుంది కానీ, మాజీ మంత్రులకు ఉండదా? అని ప్రశ్నించారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలను బీఆర్ఎస్‌కు అంటగట్టడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ప్రవీణ్‌కుమార్‌పై బురద జల్లుతున్నదని మండిపడ్డారు. ఫుడ్ పాయిజన్‌తో 48 మంది పిల్లలు చనిపోవడం బాధాకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. విద్యాశాఖ ఇప్పటికీ సీఎం వద్దనే ఉన్నదని, సమీక్ష జరిపి హాస్టళ్లలో పరిస్థితులను మెరుగుపర్చాలని కోరారు. గత పదేండ్లలో లేని పరిస్థితులు ఇప్పుడెందుకు తలెత్తుతున్నాయని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వం పట్టింపు లేనట్టుగా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు.

కుట్రల సంస్కృతి కాంగ్రెస్ పార్టీదే

ఫుడ్ పాయిజన్ ఘటనలు బీఆర్ఎస్ కుట్ర అని కాంగ్రెస్ ఆరోపిస్తున్నదని, కానీ కుట్ర సంస్కృతి కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. రాష్ట్రంలో గురుకులాలను వెయ్యికి పెంచి విద్యార్థులను ప్రపంచంతో పోటీపడేలా కేసీఆర్ తయారుచేశారని, విద్యతోపాటు మంచి భోజనాన్ని కూడా అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గురుకులాలను నిర్వీర్యం చేసిందని, ఈ దుర్మార్గ ప్రభుత్వానికి పేద పిల్లలపై ప్రేమ లేదని అన్నారు. ఫుడ్ పాయిజన్ జరిగిన నాలుగు రోజులైనా విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టల్‌లోకి అనుమతించడం లేదని కానీ, కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేషన్ చైర్మన్లను, వారితో వచ్చిన 30-40 మంది అనుమతించారని ఆరోపించారు. విద్యార్థులపై తల్లి ప్రేమతో వెళ్లే తమకు ప్రొటోకాల్ అవసరమా? అని ప్రశ్నించారు. గాలికి వచ్చిన కార్పొరేషన్ చైర్మన్‌లకు ప్రొటోకాల్ ఉంటుంది కానీ, ప్రజల ఓట్లతో గెలిచిన తమకు ఉండదా? అని మండిపడ్డారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని ఎస్పీ అంటున్నారని, మహిళా ప్రజాప్రతినిధులు పోతే చూసుకునే సామర్థ్యం లేని మీరు రాష్ట్రాన్ని ఎలా కాపాడతారని ప్రశ్నించారు.

పరామర్శకు వెళితే అరెస్టు చేస్తారా?: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తాండూరు గిరిజన హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ బాధిత విద్యార్థులను పరామర్శించడానికి వెళ్తున్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సహా పార్టీ సీనియర్ నేతలను అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పసిబిడ్డలకు కనీసం ఆహారం పెట్టలేని అమానవీయ ప్రభుత్వం అరెస్టుల పేరుతో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని తలపిస్తున్నదని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే ప్రజాప్రతినిధులను అక్రమంగా అరెస్టు చేయడమేనా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డలను పరామర్శించే ప్రయత్నాన్ని అడ్డుకుంటున్న ప్రభుత్వ అమానవీయ వైఖరిని ఆయన ఖండించారు. ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేస్తున్న ప్రతిపక్షాన్ని అడ్డుకోవడం కాకుండా, పసిబిడ్డలకు పోషకాహారం అందించడం, సరైన సౌకర్యాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. అబద్ధాలు, అభూత కల్పనలతో, కాకిలెక్కలతో ప్రజలను మోసగించడమే ప్రభుత్వ విధానమా? అని ప్రశ్నించారు. రూ. 50 వేల కోట్లు, రూ. 65 వేల కోట్ల వడ్డీలు అని అవాస్తవాల వల్లింపు ఎవరి కోసమని నిలదీశారు.

పథకాలు అమలు కావాలి

ప్రకటనలు కాదు.. పథకాల అమలు కావాలని కేటీఆర్ పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని ఊదరగొట్టి ఇప్పటికీ ప్రకటనలతోనే కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. అర్హుల కోసం, అమలు కోసం మంత్రివర్గ ఉపసంఘం అని సభలు, సమావేశాలు పెట్టారని, ఏడాదిగా రైతుబంధు మీద కొండను తవ్వి ఎలుకను పట్టలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఊసేలేదని మండిపడ్డారు. అధికారం కోసం అబద్ధాలు, అధికారం దక్కిన తర్వాత పథకాల ఎగవేతకు కుంటిసాకులు అని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఆత్మవిశ్వాసంతో మీసం మెలేసిన రైతన్నను ఏడాది కాంగ్రెస్ పాలనలోనే అప్పుల పాలు చేసిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.

తాండూర్ గురుకులాన్ని సందర్శించిన జడ్జి

- విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా

తాండూరు, డిసెంబర్ 12: తాండూరు ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను గురువారం తాండూరు కోర్టు జడ్జి శివలీల పరామర్శించారు. హైకోర్టు సూచనల మేరకు ఆమె గురుకుల పాఠశాలను సందర్శించి ఘటనపై ఆరా తీశారు. కలెక్టర్‌తో మాట్లాడి విద్యార్థినులకు చికిత్స అందిస్తున్న తీరు, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అయితే, ఫుడ్ పాయిజన్ ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ లీగల్ సెల్ పక్షాన అడ్వకేట్లు గోపాల్, నరేందర్‌గౌడ్ జిల్లా మొదటి శ్రేణి న్యాయమూర్తి శివలీలకు వినతి పత్రం అందజేశారు.

ఎస్టీ బాలికల హాస్టల్ వార్డెన్‌పై వేటు

మరో ముగ్గురు వంట సిబ్బంది సస్పెన్షన్

వికారాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తాండూర్ ఎస్టీ బాలికల వసతిగృహంలో ఫుడ్ పాయిజన్ ఘటనపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫుడ్ పాయిజన్ ఘటనపై హాస్టల్ వార్డెన్‌తోపాటు మరో ముగ్గురిని సస్పెండ్ చేసింది. ఎస్టీ బాలికల హాస్టల్ వార్డెన్ విశ్వకుమారితో పాటు ముగ్గురు వంట సిబ్బందిని సస్పెండ్ చేస్తూ గురువారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫుడ్ పాయిజన్‌తో 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

గురుకులాల్లో వసతులపై నివేదిక ఇవ్వండి:హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గురుకులాలు, వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు తీసుకున్న చర్యలపై సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. గతంలో ఆదేశించిన మేరకు మౌలిక వసతుల కల్పన అమలు నివేదికను సమర్పించాలని కోరింది. గత ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే కల్పించిన సౌకర్యాలు, ఇంకా ఏ మేరకు సౌకర్యాలను కల్పించాల్సి ఉన్నదో నివేదిక ఇవ్వాలని తెలిపింది. తదుపరి విచారణను జనవరి 22కు వాయిదా వేసింది.

కనీస వేతన సలహామండలి సభ్యుల నియామకం

హైదరాబాద్, డిసెంబర్ 12(నమస్తే తెలంగాణ): కనీస వేతన సలహా మండలిలో 12మంది సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. మండలి చైర్మన్‌గా బీ జనక్ ప్రసాద్‌ను ఇదివరకే నియమించగా, తాజాగా సభ్యులను ప్రకటించింది. కార్మిక సంఘాల నుంచి ఐఎన్టీయూసీ నేతలు ఎర్రం పిచ్చిరెడ్డి, ఎస్. నర్సింహారెడ్డి, ఏఐటీయూసీ నుంచి ఎండీ యూసుఫ్, తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు చెందిన ఎన్. రాజు ముదిరాజ్, హైదరాబాద్ హోటల్ వర్కర్స్ యూనియన్‌కు చెందిన కొత్త పల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులను నియమించగా, యాజమాన్యాల తరఫున ఎఫ్‌టీఐఐసీకి చెందిన మీలా జయదేవ్, కశ్యప్‌రెడ్డి, మహిమా దాట్ల, డిక్కీకి చెందిన నర్రా రవికుమార్, బీడీ తయారీదారుల తరఫున బాసాని చంద్రప్రకాశ్, స్వతంత్ర సభ్యులుగా సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్‌కు చెందిన ప్రొఫెసర్ సీ. రవి, నల్సార్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఎన్. వాసంతిని నియమించారు. కనీస వేతన కమిటీ కార్యదర్శి ఈ మండలికి ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా వ్యవహరిస్తారని, సభ్యుల పదవీ కాలం రెండేళ్లు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను నిలదీస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

మా పిల్లలను మాకే చూపించరా?

- కలవకుండా అడ్డుకునే అధికారం మీకెక్కడిది?
- హాస్పిటల్‌లో కాకుండా హాస్టల్‌లో చికిత్సేంది?
- ఘటనపై కలెక్టర్‌ను నిలదీసిన విద్యార్థినుల తల్లిదండ్రులు

హైదరాబాద్ సిటీబ్యూరో/తాండూరు, డిసెంబర్ 12:(నమస్తే తెలంగాణ): 'మేము ఎంతో దూరం నుంచి పిల్లలను ఇక్కడికి పంపిస్తే ఇంత దారుణంగా చూస్తారా.. వాళ్లకు తిండికూడా సరిగ్గా పెట్టరా? మా పిల్లలను మాకు చూపెట్టకుండా ఉంచే అధికారం మీకెక్కడిది? హాస్పిటల్‌కు తీసుకెళ్లకుండా హాస్టల్‌లో ఎందుకు చికిత్స చేస్తున్నరు? నిజమేందో చెప్పండి.. అసలు మా పిల్లలకు బాగైతుందా? లేదా?' అంటూ తాండూరు గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినుల తల్లిదండ్రులు రంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను గురువారం నిలదీశారు. పాఠశాలలో కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురైన 9 మంది విద్యార్థినులను హాస్టల్‌లోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. పర్యవేక్షణకు కలెక్టర్ ప్రతీక్ జైన్ రాగా ఆయనను విద్యార్థుల తల్లిదండ్రులు, బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. తమ పిల్లలను ఇప్పటివరకు దవాఖానకు తీసుకెళ్లకుండా ఇక్కడే ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. కలెక్టర్ మాట్లాడుతూ దవాఖానలో అయితే పిల్లలు మానసికంగా ఇబ్బంది పడతారని, అందుకే ఇక్కడే ప్రభుత్వ వైద్యులతో మెరుగైన వైద్యం అందిస్తున్నామని బదులిచ్చారు. పిల్లలందరి ఆరోగ్యం కుదుటపడిందని, ఒక్క అమ్మాయికి మాత్రం కొంత అస్వస్థతగా ఉన్నదని, ఆమె కూడా త్వరలోనే కోలుకుంటుందని చెప్పారు. తల్లిదండ్రులను చూసి పిల్లలు ఏడుస్తున్నారని, వారిని సముదాయించేందుకు అప్పుడప్పుడు మాత్రమే పేరెంట్స్‌ను లోపలికి పంపి మళ్లీ బయటనే ఉంచుతున్నామని తెలిపారు. ఘటనకు కారణమైన హాస్టల్ సిబ్బందిని సస్పెండ్ చేశామని, వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తామని తెలిపారు.

మళ్లీ పురుగుల అన్నం

- పారబోసిన పేట గ్రౌండ్ స్కూల్ విద్యార్థులు
- విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ ఆందోళన

నారాయణపేట స్కూల్‌లో మధ్యాహ్న భోజనంలో వచ్చిన పురుగులు, రాళ్లు

నారాయణపేట రూరల్, డిసెంబర్ 12: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించడంలో అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. తాజాగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని గ్రౌండ్ స్కూల్‌లో పురుగులు, రాళ్లు ఉన్న అన్నం వడ్డించారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 900 మంది విద్యార్థులు చదువుతున్నారు. గురువారం 400 మందికి మధ్యాహ్న భోజనం కోసం 50 కిలోల బియ్యంతో వంట చేయించారు. అన్నంలో పురుగులు, రాళ్లు కనిపించడంతో విద్యార్థులు పారబోశారు. విషయం తెలుసుకొన్న పీడీఎస్‌యూ నాయకులు బడికి చేరుకొని విద్యార్థులతో కలిసి ఆందోళనకు దిగారు. దీంతో హెచ్ఎం దత్తురావు స్పందించి వారికి నచ్చజెప్పి వేరే బియ్యంతో మళ్లీ వండించి పెట్టడంతో ఆందోళన సద్దుమణిగింది. రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో ప్రభుత్వ బడుల్లో వడ్డించే మధ్యాహ్న భోజనంలో పురుగులు, రాళ్లు రావడం సిగ్గుచేటని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్ అన్నారు.

కేంద్రమంత్రులతో సీఎం భేటీ

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ముగ్గురు కేంద్రమంత్రులతో భేటీ అయ్యారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం, రేడియల్ రోడ్లు, మెట్రో ఫేజ్ -2, మూసీ రివర్ ఫ్రంట్ తదితర ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అందేలా చూడాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సీఎం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కేంద్రీయ విద్యాలయాలు కేటాయించాలని ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు. ఏడు నవోదయల కేటాయింపుపై ధన్యవాదాలు తెలిపారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి సాంకేతిక, ఆర్థిక అనుమతులు ఇవ్వాలని నితిన్ గడ్కరీని సీఎం కోరారు. సీఎం వెంట మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, సురేశ్ షెట్కార్, మల్లు రవి, కడియం కావ్య, అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి జితేందర్ రెడ్డి ఉన్నారు.

పరువునష్టం కేసులో మంత్రి గైర్హాజరు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): నటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణకు మంత్రి కొండా సురేఖ గురువారం గైర్హాజరయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాల నేపథ్యంలో ఆమె కోర్టుకు రాలేకపోయారని, కొంత సమయం కావాలని ఆమె తరఫున న్యాయవాది కోర్టును కోరారు. గైర్హాజరు పిటిషన్‌ను అంగీకరించిన మేజిస్ట్రేట్ శ్రీదేవి విచారణను 19కి వాయిదా వేశారు.

కేటీఆర్ కేసులో...

మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టులో శుక్రవారం విచారణ జరుగనుంది. కేటీఆర్ చేసిన ఫిర్యాదు మీద ప్రత్యర్థికి అవకాశం కలించే ఉద్దేశంతో ఏసీబీ కోర్టు మంత్రికి నోటీసులు జారీ చేసింది. ఆమెపై వచ్చిన ఆరోపణల పట్ల వివరణ ఇచ్చుకునేందుకు కోర్టు వెసలుబాటు కల్పించనుంది.

విస్తరణపై అదే ఉత్కంఠ!

- అసలు, వలస కాంగ్రెస్ బ్యాచ్‌ల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- కోశాధికారికి పదవిపై ఇద్దరు అగ్రనేతల మధ్య భిన్నాభిప్రాయం
- రేవంత్‌కు దొరకని రాహుల్ అపాయింట్‌మెంట్.. నేడు కూడా వెయిటింగ్
- మంత్రివర్గ విస్తరణ ఉంటుందో ఉండదో తెలియని అయోమయం

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర నేతల్లో ఈ వారంలోనైనా విస్తరణ ఉంటుందా లేదానన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ఈసారి కూడా మంత్రివర్గ విస్తరణ లేనట్టేనని, మరికొన్ని రోజుల సమయం పట్టేటట్టు ఉందని గాంధీభవన్ నుంచి లీకులు అందుతున్నాయి. పదవుల పందేరంలో అసలు కాంగ్రెస్, వలస కాంగ్రెస్ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవటం, ఒక బెర్తు కోసం ఆరుగురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతలు పట్టుబట్టడమే ఆలస్యానికి కారణమని ప్రచారం జరుగుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి జైపూర్ నుంచి గురువారం ఢిల్లీ చేరుకున్నారు. రోజంతా ఎదురుచూసినా ఆయనకు రాహుల్‌గాంధీ అయిపాయింట్‌మెంట్ దొరకలేదని తెలిసింది. దీంతో ఆయన కేంద్ర మంత్రులను కలిసినట్టు సమాచారం. రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ శుక్రవారం కూడా లభించకపోతే.. మరి కొంతమంది కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

కోశాధికారికి వద్దు..

మంత్రివర్గ కూర్పుపై అధిష్ఠానం సూచనల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు దఫాలు సీనియర్ కాంగ్రెస్ నేతలతో కలిసి మాట్లాడినప్పటికీ ఏకాభిప్రాయం కుదరనట్టు తెలిసింది. ప్రధానంగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ సీనియర్ కాంగ్రెస్ నేత ఎంపిక విషయంలో తీవ్ర తర్జనభర్జన జరిగినట్టు తెలిసింది. పార్టీ కోశాధికారిగా ఉన్న ఆ నేతకు మంత్రి పదవి ఇవ్వాలని ఇద్దరు అసలు కాంగ్రెస్ నేతలు పట్టుబడుతున్నట్టు సమాచారం. ఇది ముఖ్యనేతకు ఇష్టం లేదని అంటున్నారు. సీఎల్పీ నేతగా ముఖ్యనేతను ఎన్నుకునే సమయంలో సదరు కోశాధికారి తీవ్రంగా వ్యతిరేకించినట్టు తెలిసింది. దాన్ని మనసులో పెట్టుకున్న ముఖ్యనేత ఇప్పుడు ఆయనకు మంత్రి పదవి రాకుండా అడ్డంపడుతున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. వెలమ సామాజికవర్గం నుంచి ఇప్పటికే ఒకరికి మంత్రి పదవి ఇచ్చిన నేపథ్యంలో రెండో సీటు మళ్లీ అదే వర్గానికి ఇవ్వాల్సిన అవసరం లేదని ముఖ్యనేత వాదిస్తున్నట్టు సమాచారం.

ముదిరాజులకా? మున్నూరు కాపులకా?

ఒక మంత్రి పదవి బీసీలకు దక్కనుండగా, దానిని ముదిరాజుల సామాజికవర్గానికి ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిసింది. ముదిరాజుల కోటా కింద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ముదిరాజ్ ఎమ్మెల్యే పేరును అసలు కాంగ్రెస్ నేతలు ప్రతిపాదించగా.. ముఖ్యనేత విముఖత చూపినట్టు సమాచారం. బీసీలలో మరో పెద్ద కులమైన మున్నూరు కాపు నేతకు అవకాశం ఇద్దామని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వలస కాంగ్రెస్ నేత పేరును ప్రతిపాదించినట్టు తెలిసింది. దీన్ని అదే జిల్లాకు చెందిన అసలు కాంగ్రెస్ బ్యాచ్ తీవ్రంగా వ్యతిరేకించినట్టు సమాచారం.

పట్టు వీడని ఎస్సీ సామాజిక వర్గం నేతలు ..

ఇక ఎస్సీ సామాజికవర్గం నుంచి మాల, మాదిగ వర్గాలు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే మాలలు హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ పెట్టి తమ సత్తా చాటగా.. మాదిగలు వర్గీకరణ అంశంతో నరుక్కొస్తున్నారు. మాల సామాజిక వర్గం నుంచి ఒక మంత్రి ఉండగా.. మాదిగల నుంచి ఎవరూ లేరని కాంగ్రెస్‌లోని ఆ వర్గం వాదిస్తున్నది. అయితే ఎస్సీ సామాజిక వర్గం నుంచి అదిలాబాద్ జిల్లాకే చెందిన ఇద్దరు సోదరుల్లో ఒకరికి ఇవ్వవచ్చనే ప్రచారం జరుగుతున్నది. హైదరాబాద్ నుంచి ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ పేరును తెరమీదికి తెచ్చినట్టు సమాచారం. కాగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎస్టీ నేతకు మంత్రి ఇస్తే ఎలా ఉంటుందని ఆరా తీస్తున్నట్టు తెలిసింది. నాగర్జున సాగర్ ప్రాంతానికి చెందిన అసలు కాంగ్రెస్ నేత కూడా ఓ గిరిజన నాయకుని పేరునే సూచించినట్టు సమాచారం.

ఇన్‌చార్జీలంతా పార్టీని నాశనం చేస్తారా?

- అసలు మీరు రాష్ట్రంలో ఉన్నారా? లేరా?
- ఏఐసీసీ కార్యదర్శి విష్ణుతో జగ్గారెడ్డి మాటలయుద్ధం

హైదరాబాద్, డిసెంబర్ 12(నమస్తే తెలంగాణ): ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జీల వ్యవహార శైలిపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి వారి ఎదుటనే తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇన్‌చార్జీల ఇష్టారీతి నిర్ణయాలు, నియామకాలు, సిఫారసులపై తీవ్ర స్థాయిలో మండిపడినట్టు తెలిసింది. ఏఐసీసీ ఇన్‌చార్జీలంతా కలిసి పార్టీని నాశనం చేస్తారా? అని అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. బుధవారం ఒక వివాహ వేడుకలో ఏఐసీసీ కార్యదర్శి విష్ణు.. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి తారసపడ్డారు. ఈ సందర్భంగా విష్ణుపై జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడినట్టు తెలిసింది. 'ఇన్‌చార్జీలంతా కలిసి పార్టీని చంపేయాలని చూస్తున్నారా? ఇంతకీ మీరు ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్నారా? వేరే రాష్ట్రం వెళ్లిపోయారా?' అని జగ్గారెడ్డి నిలదీసినట్టు తెలిసింది. దీంతో 'మెదక్ జిల్లా బాధ్యతలు కూడా నేనే చూస్తున్న' అంటూ విష్ణు బదులిచ్చినట్టు తెలిసింది. 'పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా ఉన్నారా? వేరే రాష్ట్రం పోయారా? అధికార పార్టీ ఇన్‌చార్జీలు అంటే ఇలాగేనా ఉండేది? మీరేం చేస్తున్నారో మీకైనా అర్థం ఆవుతున్నదా?'అని నిలదీసినట్టుగా తెలిసింది. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో ఇన్‌చార్జీల జోక్యంపై ఆయన తీవ్రంగా మండిపడిట్టు తెలిసింది. కొత్తకొత్త వాళ్లకు పదవులు సిఫారసు చేస్తున్నారని, ఏండ్లుగా పార్టీని నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించినట్టు తెలిసింది. నియామకాలపై సీనియర్ నేతలైనా తమకు చెప్పడం లేదని, నియామకాలు పూర్తయిన తర్వాతే తమకు తెలుస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇదే పరిస్థితి కొనసాగితే సహించేది లేదని గట్టిగానే చెప్పినట్టు సమాచారం.

ఉద్యోగాలు ఊడతాయ్.. జాగ్రత్త

- తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్‌పై మంత్రి సీతక్క ఫైర్
- సొంత నిర్ణయాలు తీసుకున్న అధికారులపై ఆగ్రహం
- నాసిరకం సరుకులు తెచ్చే కాంట్రాక్టర్లకు నోటీసులివ్వాలని ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, లేకపోతే ఊడ్యోగాలు ఊడతాయ్ అంటూ మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్, ఉన్నతాధికారుల తీరుపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. సొంత నిర్ణయాలతో ప్రజాధనం వృథా చేస్తున్న కార